క్లుప్తంగా

సబ్‌స్టేషన్ల ఏర్పాటు అవసరం



స్థల పరిశీలన చేస్తున్న ఎస్‌ఈ దేవప్రసాద్

కవిటి: మండల కేంద్రాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయడం అవసరమని విద్యుత్ శాఖ ఎస్‌ఈ దేవప్రసాద్ అన్నారు. కవిటిలో దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ చొరవతో ఏపీ ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు అంగీకరించినట్లు తెలిపారు. దీని కోసం అవసరమైన స్థలాన్ని సేకరించే క్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు సమస్యలు వివరించారు. మండలంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనితీరును ఈ సందర్భంగా ఆయన ఆరా తీశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు బెందాళం వెంకటేశ్వరరావు,పి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదాతలను సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: రక్తదానం చేస్తే అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి ప్రాణదానం చేసినట్లేనని పలాస సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అగ్గున మేఘన అన్నారు. ఇటీవల నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సీహెచ్‌సీలో రక్తదానం చేసిన 25 మందిని మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, డాక్టర్ ఉంగ కిరణ్‌కుమార్, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం



ట్రాక్టర్ ప్రారంభిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి అన్నారు. మండలంలోని కేసరపడ ఆర్‌బీకే పరిధి ఎక్కల గ్రామానికి చెందిన బర్ల బాలకృష్ణ, శ్రీహనుమాన్ సీహెచ్‌సీ గ్రూప్ సభ్యులకు 40 శాతం సబ్సిడీతో మంజూరైన రూ.15 లక్షల విలువ గల ట్రాక్టర్, వ్యవసాయ పనిముట్లు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, సీనియర్ నేత ఇప్పిలి కృష్ణారావు, బెల్లుపడ సర్పంచ్ అయుధం జయరాం, నేతలు రంగాల శ్రీనివాసరావు, మెండ మురళి, తలగాన సంతోష్, నెయ్యిల రుషి, రంగాల దీనబంధు తదితరులు పాల్గొన్నారు.

'డిగ్రీ కళాశాలలకు అనుమతివ్వండి'

కవిటి: విద్యాపరంగా వెనుకబాటులో ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని కవిటి, కంచిలి, సోంపేట మండల కేంద్రాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ కోరారు. ఈ మేరకు అమరావతిలోని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

డెంగీ రహిత సమాజాన్ని స్థాపిద్దాం



చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్యశాఖ అధికారులు

కవిటి: సమర్థవంతమైన సమాజ భాగస్వామ్యంతో డెంగి రహిత సమాజాన్ని స్థాపిద్దామని బెలగాం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ పి.రాకేష్, డాక్టర్ డి.కవిత అన్నారు. మండలంలోని ఆర్.బెలగాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జాతీయ డెంగి నివారణ దినోత్సవంలో భాగంగా చైతన్య ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ప్రధానంగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ దోమల నివారణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మాదిన కృష్ణారావు, హెల్త్ ఎడ్యుకేటర్ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు బానిస కావద్దు



టెక్కలి: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీఎస్పీ బాలచంద్రారెడ్డి తదితరులు



సోంపేట: మాట్లాడుతున్న సీఐ వరప్రసాద్



కవిటి: అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రాము



ఇచ్ఛాపురం: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐ ఈశ్వర్‌చంద్రప్రసాద్ తదితరులు

- డీఎస్పీ బాలచంద్రారెడ్డి

టెక్కలి: యువత చెడు అలవాట్లకు బానిస కావొద్దని టెక్కలి డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి సూచించారు. చెడు మార్గంలో వెళ్తున్న యువతను సన్మార్గంలో నడిపించేందుకు జిల్లా ఎస్పీ జీఆర్.రాధిక నేతృత్వంలో నిర్వహిస్తున్న 'జాగృతి-యువత కోసం' కార్యక్రమాన్ని స్థానిక ఆదిత్య కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెడు మార్గానికి గురవుతున్న యువతను సన్మార్గంలో నడిపించి, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ఉద్దేశ్యమని పేర్కొన్నారు. మత్తు పదార్థాలు, లైంగిక నేరాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, దొంగతనాలు, ఇతర సంఘ విద్రోహక చర్యలకు గురవ్వకుండా యువతను సన్మార్గంలో నడిపించేందుకు కార్యక్రమం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐ చంద్రమౌళి, సాహిత్య సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు జీవీ రెడ్డి మాస్టారు, ఎస్‌ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కోటబొమ్మాళి: అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ షేక్ మహ్మద్ అలీ



కంచిలి: అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ చిరంజీవి

యువత చైతన్యవంతమవ్వాలి

కోటబొమ్మాళి: గ్రామాల్లోని యువత చైతన్యవంతమవ్వాలని ఎస్‌ఐ షేక్ మహ్మద్ అలీ సూచించారు. స్థానిక రెడ్డి కల్యాణ మండపంలో జాగృతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యువతకు చట్టాలు, మంచి నడవడికపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్ లఖినేని కరుణ్‌కుమార్, పీసీలు దుర్గారావు, రాము తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగమవ్వాలి

కవిటి: యువత సామాజిక సేవలో భాగస్వాములు కావాలని ఎస్‌ఐ కె.రాము సూచించారు. స్థానిక కల్యాణి డెన్‌లో యువకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, పి.చంద్రశేఖర్, లోళ్ల రాజేష్, బీవీవీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: సామాజిక సేవకు యువత ముందుండాలని సీఐ ఆర్.వరప్రసాద్ సూచించారు. పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో 'జాగృతి యువత కోసం' ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాగృతి సభ్యులకు, మహిళా పోలీసులకు పోలీసు అధికారులు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి డి.చిరంజీవులు, ఎస్‌ఐ ఎస్.బాలరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే బారువలో శిక్షణ కార్యక్రమాన్ని ఎస్.ఐ వి.సత్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యుడు ఎం.ప్రదీప్, విశ్రాంత హెచ్‌ఎం బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి

కంచిలి: యువత క్రమశిక్షణతో మెలగాలని ఎస్‌ఐ ఎస్.చిరంజీవి సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో 'జాగృతి' అవగాహన సదస్సు నిర్వహించారు. యువత ఉన్నత స్థానానికి ఎదిగేందుకు విద్యార్థి దశలోనే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. పోలీసులతో దోస్తీగా మెలగాలని, విధుల్లో పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యుడు నర్తు కృష్ణంరాజు, విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్.సోమేశ్వరరావు, ఎం.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యువత భాగస్వామ్యంతో నేర నియంత్రణ

ఇచ్ఛాపురం: యువత భాగస్వామ్యంతో నేర నియంత్రణ చేయవచ్చని సీఐ ఆర్.ఈశ్వర్‌చంద్రప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో 'జాగృతి-యువత కోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ ఎస్‌ఐలు కె.గోవిందరావు, రమేష్, జోహార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: యువత చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి అన్నారు. కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రం పాత జాతీయ రహదారిలో ఉన్నటువంటి టీకేఆర్ కల్యాణ మండపంలో జాగృతి యువత కోసం అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాశీబుగ్గ రూరల్ సీఐ శంకరరావు, వజ్రపుకొత్తూరు ఎస్‌ఐ మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- సోంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

సోంపేట: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మేజర్ పంచాయతీ సచివాలయం-2 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలను తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో బెందాళం వెంకటరమణ, ఈవో వరప్రసాద్, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్‌రెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ నగిరి ప్రభావతి, ఉప సర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ పాడుగు కామేష్, పార్టీ నాయకులు తోట ఢిల్లీరావు, బీన ఢిల్లీరావు, లొట్ల ఆనంద్, నెప్రాలా, కోట్నీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూసర్వేకు రైతులు సహకరించాలి

- పలాస తహసీల్దార్ మధుసూదనరావు
- సజావుగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ మధుసూదనరావు

పలాస: మండలంలో ప్రస్తుతం జరుగుతున్న సమగ్ర భూసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ మధుసూదనరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సర్వే చేయిస్తోందని, రైతులు సహకరించకపోతే తప్పులు దొర్లే అవకాశం ఉంటుందన్నారు. లక్ష్మీపురం సర్పంచ్ లఖినాన లక్ష్మి మాట్లాడుతూ తమ గ్రామంలో 60 మందికి కొత్త పాసు పుస్తకాలు రాగా, వాటిలో తప్పులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తహసీల్దార్ స్పందించి ఒక ఏడాది వరకు తన పరిధిలోనే తప్పులు సరిదిద్దుకోవడానికి అవకాశం ఉందని చెప్పారు. పీఆర్‌ఏఈ పార్వతి మాట్లాడుతూ మండలంలో గ్రామ సచివాలయాల భవన నిర్మాణాలు పూర్తవుతున్నాయని, 60 శాతం బిల్లులు కూడా అందిపోయాయని వెల్లడించారు. ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు మాట్లాడుతూ.. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షలు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారి పాపారావు మాట్లాడుతూ ప్రస్తుతం రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు సిద్ధం చేస్తున్నామని, రైతు భరోసా కేంద్రాల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వంశధార ఏఈ సాంబమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనుల్లో పూర్తిగా తలమునకలై ఉన్నామన్నారు. ఎర్త్ బండ్ పనులు వేగవంతమయ్యాని చెప్పారు. అమలకుడియా పూర్ణభద్ర గెడ్డపై ఆనకట్ట కోసం, కమలాపురం యూటీ కోసం ఎస్టిమేట్లు వేసి పంపించామని మంజూరవ్వాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ఉంగ సాయికృష్ణ మాట్లాడుతూ వంశధార అధికారులకు వంశధార కాలువ సరిహద్దులు కూడా తెలియవని ఆగ్రహం వ్యక్తం చేశారు. వంశధార అధికారులు ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇస్తున్నారని ఆరోపించారు.

సమావేశంలో వైస్ ఎంపీపీలు తలగాన శ్రీరాములు, సవర చంద్రమ్మ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో శంకరావు, రెంటికోట పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్ కుమార్, మెట్ట వైకుంఠరావు, ఇరిగేషన్ ఏఈ మధు, ఎంఈవో శ్రీనివాసరావు, మద్దిల పాపారావు, తామాడ మదన్, సైని దేశయ్య, జి.మోహనరావు, కొర్ల సంతోష్, వరిశ రామారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

భక్తిశ్రద్ధలతో పూజలు

కవిటి: మండలంలోని కుసుంపురంలో మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించిన హరేరామ హరేకృష్ణ నామయజ్ఞం ఘనంగా ముగిసింది. దీనిలో భాగంగా మంగళవారం ప్రతీ ఇంటి ముందు ఏర్పాటు చేసిన పూర్ణకలశాలను మహిళలు సామూహిక శోభాయాత్రగా సముద్రంలో నిమజ్జనానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని ఎర్రముక్కాం గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామదేవత ఉత్సవాల్లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొన్నారు. గ్రామ దేవతలు మంకినమ్మ, కొత్తమ్మ, పెద్దమ్మ, కాళమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆమెతో పాటు సోంపేట, కంచిలి ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాస్, పైల దేవదాస్ రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్ రెడ్డి, పార్టీ నాయకులు బీన ఢిల్లీరావు, బి.కామేశ్వరరావు, ఎం.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: మండలంలోని రథజన బొడ్డపాడు పంచాయతీ బెల్లకొలలో జరుగుతున్న చింతల పోలమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ దర్శించుకున్నారు. ఆయనతో పాటు నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, సర్పంచ్ బొడ్డపాటి తిరుపతిరావు, చిన్ని జోగారావు, సర్లాన బైరాగి తదితరులు ఉన్నారు.

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్య దైవం చింతామణి అమ్మవారి సంబరాలు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. కవిటికి చెందిన అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిరూపమైన గజముద్దను మేళతాళాలతో బాణాసంచా కాలుస్తూ ఊరేగింపు చేశారు. అంతకుముందు కులదైవం కంచి కామాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాళికాదేవి సంబరం నిర్వహించారు. వేడుకల్లో సంఘం అధ్యక్షుడు లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

'గ్రంథాలయాలను వినియోగించుకోవాలి'

కాశీబుగ్గ: గ్రంథాలయాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని పలాస శాఖ గ్రంథాలయ అధికారి వై.రాంబాబు సూచించారు. గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా పేపర్ రీడింగ్ ప్రక్రియను మంగవారం చేపట్టారు. కార్యక్రమంలో రీడర్స్ హేమంతు, దినేష్, లవకుమార్, వెంకట్, ముంగుర పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ఆక్రమణపై ఫిర్యాదు

టెక్కలి: స్థానిక కాటాబందలో శ్మశానవాటిక ఆక్రమణపై పలువురు విశ్వ బ్రాహ్మణులు టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా శ్మశానవాటికగా వినియోగిస్తున్న స్థలాన్ని కొంతమంది ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి

టెక్కలి: ప్రతీ విద్యార్థి ప్రాథమిక స్థాయి నుంచే ఆంగ్లంపై పట్టు సాధించాలని విశ్రాంత ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు జి.మోహన్‌రావు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఆంగ్ల భాష విశిష్టత గూర్చి మంగళవారం వివరించారు. అనంతరం ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలను అందజేశారు.

ఉద్దానంలో ఈదురు గాలులు

ఇచ్ఛాపురం రూరల్: మంగళవారం పగలంతా విపరీతంగా ఎండ ఉండగా, సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో పాటు వర్షం, ఈదురు గాలులతో చెట్లు నేలకొరిగాయి. కొన్నిచోట్ల విద్యుత్ వైర్లు తెగిపోవడంతో రాత్రి వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులే కీలకం

- డిప్యూటీ డీఈవో పగడాలమ్మ



ప్రచార వాహనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో పగడాలమ్మ

మందస: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులే కీలకమని డిప్యూటీ డీఈవో జి.పగడాలమ్మ అన్నారు. మండలంలోని హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే చక్కని పాఠ్య ప్రణాళికతో బోధనా సామాగ్రి సిద్ధం చేసుకొని, విద్యార్థులకు సులభమైన రీతిలో విద్యా బోధన చేయాలన్నారు. పాఠశాల పునః ప్రారంభం సమయానికి జేవీకే కిట్లను అందించాలని ఆదేశించారు. పదో తరగతి తప్పిన విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం నాడు-నేడు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నూతనంగా మంజూరైన జూనియర్ కళాశాలతో పాటు పాఠశాలలో విద్యార్థులను చేర్పించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక రథం ఏర్పాటు చేసి, గ్రామాల్లోకి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రభుత్వ విద్య ఆవశ్యకతను వివరించడం అభినందనీయమన్నారు. ఇంటర్ ఎంపీసీలో 40 మంది, బైపీసీలో 20 మంది విద్యార్థులు చేరడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్‌ఎం నగిరి తారకేశ్వరరావు చెప్పగా, ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.తేజేశ్వరరావు, జి.లోహితాస్యుడు, కె.సాంబమూర్తి, జి.కోదండరావు తదితరులు పాల్గొన్నారు.

శివాజీ వ్యాఖ్యలు సరికాదు

- అక్రమాలు నిరూపిస్తే తొలగిస్తాం
- వైఎస్సార్‌సీపీ నాయకుల సవాల్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో టీడీపీ నిర్వహించిన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ వ్యాఖ్యలు సరికాదని పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ.. శివాజీ తీరును తీవ్రంగా ఖండించారు. అత్యంత సామాన్య కుటుంబానికి చెందిన సీదిరి అప్పలరాజు మంత్రిగా పనిచేస్తుండడం ఓర్వలేకపోతున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పలాస నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని తెలియజేశారు. పలాసలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం, రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు పునః ప్రారంభం, బాధితులకు ప్యాకేజీ క్లియరెన్స్, ఆఫ్‌షోర్ పనులు పునః ప్రారంభం, వజ్రపుకొత్తూరు నుంచి కాశీబుగ్గ పెట్రోల్ బంక్ వరకు డబుల్ రోడ్ నిర్మాణం, నూతన పారిశ్రామిక వాడ మంజూరు, నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల విస్తరణ, సుందరీకరణ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలియజేశారు. ఇవేమీ తెలియకుండా ప్రజలను మభ్యపెట్టడమే రాజకీయం అనుకొనే గౌతు కుటుంబం అనేక అవాస్తవాలను మాట్లాడుతోందని దుమ్మెత్తిపోశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎక్కడైనా భూ ఆక్రమణలు చేసుంటే వాటిని తొలగించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. గౌతు శివాజీ చేసిన వ్యాఖ్యలపై చర్చించేందుకు బుధవారం ఉదయం 10 గంటలకు కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద జేసీబీతో సిద్ధంగా ఉంటామని, టీడీపీ నాయకులకు దమ్ముంటే ఆక్రమణలు నిరూపించాలని సవాల్ విసిరారు. సమావేశంలో పలాస-కాశీబుగ్గ పట్టణ పార్టీ అధ్యక్షుడు సనపల సింహాచలం, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ బడగల బాలచంద్రుడు, మున్సిపల్ విప్ దుర్గాశంకర్‌పండా, అధికార ప్రతినిధులు గుజ్జు జోగారావు, శిష్టు గోపి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు బెల్లాల శ్రీనివాస్, కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు, కో-ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.